# కుటుంబమే స్వర్గము

పం॥ కృ॥ మూ॰ ర్తిగారు

గీ॥ తనిపిరే వేల్పు లుదధిరత్నములచేత|
వెరచిరే ఘోరకాకోలవిషముచేత|
విడచిరే యత్నమమృతంబు పొడముదనుక|
నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు॥"

—భర్తృహరి.

శ్రీమతి ఎ. జానకమ్మగారను నొక కన్యకామణి హైకోర్టు న్యాయవాదిగా సమూదుకాఁబడినయట్లు గత నెల మధ్య హిందూపత్రికయందుఁ జదివి ఆమె జీవిత సంగ్రహమును సంపాదించి, మన యాంధ్ర సోదరీమణులకు నివేదింతుఁగాక యని సంకల్పించి వారి యింటికిఁబోతిని. హైకోర్టు వకీళ్లలోఁ బ్రసిద్ధులగు శ్రీమాన్ యం.యె. శ్రీనివాసయ్యంగారి కుమార్తెయే యీ శ్రీమతి జానకిఅమ్మగారు. శ్రీ అయ్యంగారు సన్మానించి తమ బిడ్డలఁ జూపించిరి. శ్రీ జానకమ్మగారే గాక యీమె తరువాతఁ బుట్టిన ముగ్గు రాడుబిడ్డలునుగూడ బి. యే.లు ప్యాసై యున్నారు. అందులో శ్రీ జానికమ్మగారి తరువాతి యామె, ఎప్రెంటిస్‌కోర్సు * పూర్తిచేసి పరీక్షకుఁ బోనున్నది. ఈమె తరువాతి యామె ఎప్రెంటిస్‌కోర్సున శిక్షణ బడయుచున్నది; కడసరి చెల్లెలు బి.యల్. క్లాసులోఁ జదువుచున్నది. ఆహా! ఆ తలిదండ్రుల భాగ్యమెంత యనవచ్చును! ఈ సంచికయందు వారందరి ఛాయాపటములును సనామములై చిత్రింపఁబడియున్నవి. మరియు నా పుణ్యదంపతులు ఈ బిడ్డలందరితోఁ గూర్చున్న ఛాయాపటముగూడ దీననున్నది. ఇంతే కాక "మీ యనుభవజ్ఞానము నొక వ్యాసముగా వ్రాసి లోకమునకుఁ బ్రసాదింపుఁ" డని నేను గోరినవెంటనే వారిది వ్రాసి దయచేయించిరి. అదియును భాషాంతరీకరింపఁబడి యిందు ప్రకటితమై యొప్పుచున్నది. పాఠకలోక మీ యంశమును దిలకించి యానందింత్రుగాక!

"బాలికల విద్యాభ్యాసముఁ గూర్చి మీ యనుభవమును దెలియఁజేయుడని గృహలక్ష్మి సంపాదకులు నన్నుఁ గోరిరి. నేను నట్లె యంటిని. మన యాడుబిడ్డల దుష్టస్థితినిఁ గూర్చియు, దానిఁ జక్కఁజేయుటకుఁగల మార్గములంగూర్చియు నాకుండిన యభిప్రాయములు, నా యనుభవమువలన మరింత బలపడినవి.

నేను, యఫ్.యే. క్లాసులోఁ జదువుచుండినపుడు, మా వైష్ణవశాఖయందుఁ బండ్రెండేండ్ల బాలికయొకతె, పెండ్లియైన యొకటి రెండు వారములలోనే పాపము

* బి.యె. బి.ఎల్. పరీక్షఁ దుత్తీర్ణులయిన పిమ్మట అనుభవశాలులగు న్యాయవాదులవద్ద శిక్షణబడయుటను ఎప్రెంటిస్‌కోర్సు అందురు.

వితంతువైనది. ఇది వినఁగానే నా గుండె బ్రద్దలైనది. "ఈ ఘోరస్థితినుండి యాఁడు పిల్లల నుద్ధరింపలేమా" యని నేనును నా తోడి మఱికొందఱు విద్యార్థులును తీవ్ర మాలోచనలఁ జేయ నారంభించితిమి. ఆవెంటనే యొకమీటింగేర్పాటుసేయఁబడినది. మా హృదయవేదన మా పెద్దవాండ్ల కేమి తెలియును? "ఇటువంటి యనవసరపు టధిక ప్రసంగములు చేసి కొంపమీఁదికిఁ దేవల"దని వారు మమ్ము గట్టిగాఁ జీవాట్లు పెట్ట నారంభించిరి. ఆకాలములో మేము చేయఁ గలిగిన దేదియు లేకున్నను, సంఘమునం దప్పుడప్పుడు వినఁబడుచున్న యిట్టి ఘోర వార్తలు, మా యుద్రేకమును మాత్రము రేపుచుండినవి.

కాలక్రమమున నా కార్గురాడపిల్లలును ఒక మగవాఁడును గల్గిరి. నేను చిన్నప్పటి నుండియు మొండితనము గలవాఁడనగుటఁ జేసి "వీఁడు కులాచారములను గాలఁ ద్రోసి ఆడుబిడ్డల నధోగతులపాలు సేయు నేమో" యని మాతల్లి, గుండెలడలఁ జేసుకొనుచుండెను. కాబట్టి యామె బ్రతికి యుండఁగనే మొదటి యిద్దరి బిడ్డలకు ముడి పెట్టించినది. ఈ వివాహములు చేసి నేనును నా భార్యయుఁ బొందిన యనుభవములు, శ్రీహరీ, మా పగవారికైన మేము కోరము. అది యట్లుండఁగాక.

ఆదెబ్బతోఁ "బ్రపంచక మెల్లఁ దల్లక్రిందు లగుఁగాక, కాని యీ మిగిలిన కూఁతుండ్ల వివాహవిషయమును స్వప్నమందైనఁ దలంపవల"దని నేనును నా యిల్లాలును దృఢ నిశ్చయము జేసుకొంటిమి.

సోదరీమణులారా, ఇచట నొక చిన్న ముచ్చట జెప్పి యావల నా తరువాతి కథకు వత్తును. ఒక యుపాధ్యాయుఁడు, "మన కప్పుడు గడుపునింపి కట్టుకొనుటకు వెచ్చని గుడ్డలనిచ్చు జంతువేది?" యని ప్రశ్నించెను. అపుడొక బాలిక చప్పునలేచి 'అప్ప' (తండ్రి) యని బదులిడెను. ఎంత తమాషాగానున్నను ఈ ప్రత్యుత్తరము కుటుంబయాత్రయందుఁ బరమసూనృతమే కదా! సర్వత్ర బిడ్డలఁ బెంచి పెద్దవారలఁ జేసి, మంచి చెడ్డలఁ దెలుపుచు వారియందు నెల్లవేళల సానుభూతిగలిగి వారి నుచ్ఛస్థితికిఁ దెచ్చుటకుఁ దండ్రియే, ముందు తల్లిగా మారిపోవలయును. లేకున్న వ్యవహారము కుదురదు. తల్లి మారనక్కరలేదు. ఆమె కీగుణములు స్వభావసిద్ధములే. ఐనను, ఆమె మాత్రము సనాతనాచారసంకుచితస్వభావ కాఁగూడదు. అదృష్టవశమున నాకంటె విశాలతరహృదయయైనది నా భార్య. కాఁబట్టియే నా యాటలు సాగినవి.

"పిల్లలకుఁ బెండ్లిండ్లు వద్దు. వారిని జదివించి తీరవలయు"నని నే మాలుమగలము ఆఖరు నిశ్చయముఁ జేసుకొంటకు ముందుఁ గీర్తిశేషులైన మహనీయుఁడు జి. సుబ్రహ్మణ్య అయ్యరుగారితో సలహా చేసితిని. ఆ పుణ్యాత్ముఁడు "మూఁడు మాటలు కొంగున ముడివైచుకొ"మ్మని సెలవిచ్చెను:—

1. సాధారణముగా దినమున కొకరూక వెచ్చముసేయునపుడు పండుగలు పర్వదినము లందు మఱినాల్గణాలు వ్యయముచేయ సిద్ధుఁడ వగుము.